క్లుప్తంగా

చౌలపల్లికి 24గంటల కరెంట్

కేశంపేట: మండల పరిధిలోని చౌలపల్లి గ్రామానికి విద్యుత్ ఫీడర్ లేకపోవడంతో తరచూ విద్యుత్ అంతరాయంఏర్పడుతుండేదని గ్రామస్తులు తెలిపారు. ఈ సమస్యను గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కేశంపేట సబ్‌స్టేషన్‌లో చౌలపల్లి గ్రామానికి ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేసి గ్రామానికి 24 గంటల విద్యుత్ సరఫరా అయ్యే విధంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

షాబాద్: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ సురేఖ, మేనేజర్ భద్రయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగర్‌గూడ గ్రామంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏబీవీ ఆస్పత్రి వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 110 మంది వరకు గ్రామస్తులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణాగౌడ్, బీసీఐ మేనేజర్ పవన్‌కుమార్, వెల్‌స్పన్ ఫౌండేషన్ సిబ్బంది శిరీష, రమేశ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ


విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న దాత

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఇంద్రానగర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ప్రకాశ్ తన సోదరుడు అడ్వకేట్ లక్ష్మణాచారి జ్ఞాపకార్థం ఉన్నత పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 200 మంది విద్యార్థులకు బుధవారం ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ జగదీశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతలు సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉదయ్‌కుమార్, ఉపాధ్యాయులు రవి, నర్సింలు, మాన్య, నరేందర్, వకుళాదేవి, శ్యామల, రాజయ్య, సంజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి


బోరుమోటార్‌ను ప్రారంభిస్తున్న నాయకుడు శ్రీరాంరెడ్డి

షాబాద్: ప్రజలకు తాగునీటి సమస్య తీర్చేందుకు తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తిమ్మన్నోళ్ల శ్రీరాంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో ప్రజలకు తాగునీరు అందించే బోరు మోటార్ పాడవడంతో ఎవరూ పట్టించుకోలేదు. దీంతో అదే గ్రామానికి చెందిన నాయకుడు శ్రీరాంరెడ్డి వెంటనే స్పందించి కొత్త బోరు మోటార్ తీసుకొచ్చి బిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు గ్రామంలో ఉన్న బోరు మోటార్ చెడిపోవడంతో బాగుచేయించామన్నారు. గ్రామస్తులు శ్రీరాంరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు బందయ్య, మల్లేష్, కృష్ణయ్య, బిక్షపతి, రాములు, కృష్ణ, శ్రీను, తదితరులు ఉన్నారు.

సొంత ఖర్చులతో సీసీ కెమెరాల ఏర్పాటు

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ కాలనీలో ఉన్న పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాల ఆవరణలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు కక్రోళ్ల సురేందర్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, యాదయ్య, జంగయ్య, రమేశ్, శివకుమార్, రవీందర్, అనీల్‌కుమార్, దర్శన్, రాజేందర్, జయప్రకాశ్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం

- ప్రజాపాలన విజయోత్సవాల్లో ఎమ్మెల్యే కాలె యాదయ్య
- మహిళా సంఘాలకు రూ.1.95కోట్ల చెక్కులు
- మున్సిపాలిటీలో స్వచ్ఛ ఆటోలు ప్రారంభం



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, చైర్‌పర్సన్ విజయలక్ష్మి

శంకర్‌పల్లి: జిల్లాలో మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా నిలపడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆయన బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మితో కలిసి శంకర్‌పల్లిలో పర్యటించారు. మున్సిపల్ కా ర్యాలయ ఆవరణలో మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన రూ.1.95కోట్ల చెక్కును మహిళలకు అందజేశారు. అనంతరం పారిశుద్ధ్య నిర్వహణలో ఉత్తమ సేవలందించిన కార్మికులను ఘనంగా సన్మానించారు. ఇటీవల మున్సిపాలిటీలో చెత్త సేకరణ కోసం కొనుగోలు చేసిన 2 స్వచ్ఛ ఆటోలను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో హైదరాబాద్ రౌండ్ టేబుల్ 134 సభ్యులు నిర్మిస్తున్న రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకెళ్తుందని, పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీకి మరిన్ని నిధులు వస్తున్నాయని, రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలపడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని కోరారు. అధికారులు, సిబ్బంది ఎవరూ తమ విధుల్లో నిర్లక్ష్యంగా ఉండకూడదని హెచ్చరించారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలుంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, నాయకులు ప్రవీణ్‌కుమార్, ప్రకాశ్ గుప్తా, పాండు రంగారెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు సహకరించండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్, నాయకులు

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న కొత్తూరు–జేపీదర్గా, కొత్తూరు–కుమ్మరిగూడ రోడ్ల విస్తరణ పనులకు స్థానికులు, వ్యాపారులు సహకరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఇందులో భాగంగా ఆయన పలువురు నాయకులతో కలిసి బుధవారం రోడ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్తూరు జేపీ దర్గా రోడ్డును విస్తరిస్తే మరింత వ్యాపారం వృద్ధి చెందుతుందన్నారు. ఈ కూడలి విస్తరణకు స్థానికులు, వ్యాపారులు, రాజకీయాలకతీతంగా అభివృద్ధికి సహకరించాలని కోరారు. రోడ్డు విస్తరణకు తోడు అవసరమైతే విగ్రహాల ఏర్పాటుకు అదనంగా నిధులు కేటాయిస్తామని ఆయన సూచించారు. అనంతరం కొత్తూరు–కుమ్మరిగూడ రోడ్డు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, మహేందర్, గోపాల్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, శివకుమార్, నర్సింహ, సత్తయ్య, శ్రీను, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. మహాదానం

నందిగామ: కఠిన నియమాలతో మాల ధరించిన అయ్యప్ప మాలదారులకు అన్నదానం చేయడం చాలా గొప్ప విషయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని అయ్యప్పస్వామి దేవాలయంలో మాజీ ఎంపీటీసీ చంద్రపాల్‌రెడ్డి బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిలు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎంతో గొప్ప చరిత్ర ఉన్న అయ్యప్ప ఆలయంలో ప్రతి ఏటా దాతల సహకారంతో సుమారు రెండునెలల పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందించదగిన విషయమన్నారు. అనంతరం అన్నదాతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వాములు సుదర్శన్‌గౌడ్, కుమార్‌గౌడ్, సూక్యానాయక్, మాలదారులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

- మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన


కమ్మదనం అటవీ ప్రాంతంలో మొక్కలు నాటుతున్న నాయకులు, అధికారులు

షాద్‌నగర్‌రూరల్: మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత మనందరిపై ఉందని మార్కెట కమిటీ చైర్‌పర్సన్ సులోచన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం కమ్మదనం శివారులో అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి సులోచన హాజరై కాంగ్రెస్ నాయకులు, అటవీ శాఖ అధికారులతో కలిసి మొక్కలను నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సంవత్సర కాలంలోనే నెరవేర్చడం సీఎం రేవంత్‌రెడ్డి పాలనా దక్షతకు నిదర్శనమన్నారు. జీవకోటి మనుగడకు చెట్లు ఎంతో ప్రధానమని, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణతో పాటు వ్యవసాయ పొలాల్లో మొక్కలను నాటాలని, అడవులను రక్షించేందుకు ప్రజలందరూ అటవీశాఖ అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, ఎండీ.ఇబ్రహీం, బొమ్ము అరుణ, అంజయ్యగౌడ్, నర్సింలు, చెన్నయ్య, నర్సింలు, అటవీ శాఖ అధికారులు, గురుకుల పాఠశాల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో సాధించింది శూన్యం

- హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు

షాద్‌నగర్‌రూరల్: గతేడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా విజయోత్సవాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏం అభివృద్ధి చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన పనులను మళ్లీ ప్రారంభిస్తూ మేమే చేస్తున్నామంటూ గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం దాదాపు 24కోట్ల నిధులను ఇచ్చిందని, కాంగ్రెస్ ఎంత ఇచ్చిందో చెప్పాలని సవాల్ విసిరారు. సబ్సిడీ సిలిండర్, కొత్త రేషన్‌కార్డుల మంజూరు, పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, ప్రతి మహిళకు నెలకు రూ.2500, పెంచుతామని చెప్పిన ఆసరా పెన్షన్, అర్హులందరికీ రుణమాఫీ, రైతులకు రైతుబంధు వంటి పథకాలను పూర్తిస్థాయిలో ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీ డీకే. అరుణను ఆహ్వానించకపోవడంపై పార్లమెంట్‌లో ప్రివిలేజ్‌మోషన్‌కు ఎంపీ ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. లగచర్ల ఘటన తర్వాత డీకే.అరుణపై కుట్రలు జరుగుతున్నాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే తప్పిదంతోనే చటాన్‌పల్లి రైల్వేఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచి పోయాయన్నారు. మంత్రి నిధులతో నెల రోజుల్లో బ్రిడ్జిని పూర్తిచేస్తామని చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాజకీయాలకతీతంగా నాయకులందరినీ కలుపుకొని అభివృద్ధి పనులను చేపట్టి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు చెంది మహేందర్‌రెడ్డి, చెట్ల వెంకటేశ్, మల్చలం మురళీ, వంశీకృష్ణ, ఇస్నాతి శ్రీనివాస్, శేరి విష్ణువర్ధన్‌రెడ్డి, మోహన్‌నాయక్, లష్కర్‌నాయక్, మఠంరుషికేష్, సుధాకర్ అప్ప, మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, గణేష్, విజయభాస్కర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

- బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పాండురంగారెడ్డి, అనంత్‌రెడ్డి


ఆర్డీఓ చంద్రకళకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పాండురంగారెడ్డి, అనంత్‌రెడ్డి అన్నారు. మండలంలో బుధవారం పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు చేయాలని కోరుతూ ఆర్డీఓ చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలను వందరోజుల్లో చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా హామీల అమలులో విఫలమైందని మండిపడ్డారు. ఏడాదికాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకుందన్నారు. చేవెళ్లలో బస్ డిపో నిర్మిస్తామని భూమిని సేకరించి మరిచిపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి డిపో నిర్మాణం, నియోజకవర్గంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అంజనేయులుగౌడ్, డాక్టర్ వైభవ్‌రెడ్డి, డి.శర్వలింగం, మానిక్యరెడ్డి, కృష్ణాగౌడ్, శంకర్, శ్రీనివాస్, ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమోహన్, సత్యనారాయణ, శ్రీనివాస్, అభి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానిస్తున్న జేఏసీ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఘనంగా సన్మానించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. నిరుపేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ తాలుకా చైర్మన్ జనార్దన్, కన్వీనర్ నక్క బాల్‌రాజ్‌యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, టీఎన్జీఓ తాలుకా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామారావు, పాండు, శ్రీనివాసరాజు, నర్సింలు, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యేకు ఉపాధ్యాయుల వినతి

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం హెచ్‌ఎం శైలజ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాన్ని నిర్మించి దాదాపు 100 సంవత్సరాలు కావడంతో శిథిలావస్థకు చేరుకొని కూలిపోయే పరిస్థితిలో ఉందని పేర్కొన్నారు. వర్షాకాలంలో కురుస్తుందని, ఎప్పుడు కూలిపోయి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. అదేవిధంగా పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో మేకలు, కుక్కలు, పశువులు పాఠశాల ఆవరణలోకి వచ్చి మొక్కలను నాశనం చేస్తున్నాయని ఆరోపించారు. పాఠశాల భవనానికి మరమ్మతులు చేయడంతో పాటుగా ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. వెంటనే సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టడంతో పాటుగా ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

లంబాడా హక్కుల పోరాట సమితి కమిటీల ఏర్పాటు


చౌదరిగూడలో సభ్యులకు నియామకపత్రాలు అందిస్తున్న రాంబాల్‌నాయక్

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో బుధవారం లంబాడా హక్కుల పోరాట సమితి మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు రాంబాల్‌నాయక్ ఎన్నికైన వారికి నియామకపత్రాలు అందజేశారు. కొందుర్గు మండల కమిటీ అధ్యక్షుడిగా అయోధ్యాపూర్ తండాకు చెందిన గోపాల్‌నాయక్, ఉపాధ్యక్షులుగా మోహన్ నాయక్, రాజునాయక్, లక్ష్మణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి రాజేశ్, కార్యదర్శులుగా శ్రీను, రమేశ్, తులసీరాం, కోశాధికారిగా గోపాల్‌నాయక్ ఎన్నికయ్యారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కమిటీ అధ్యక్షుడిగా గోవులబండ తండాకు చెందిన సబావత్ రామ్‌చరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఆకాశ్‌నాయక్, ఉపాధ్యక్షులుగా రవీందర్‌నాయక్, రమేశ్‌నాయక్, సురేశ్‌నాయక్, కోశాధికారిగా మాన్యనాయక్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గణేశ్, రాజేశ్, లక్ష్మణ్, సతీశ్, బాబు, హన్మంతు, పాండు, సేవ్యా తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ కమిటీ ఎన్నిక

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా బ్రహ్మచారి, లక్ష్మిదేవమ్మ, ప్రధాన కార్యదర్శిగా బిజిలి సత్యం, కోశాధికారిగా సురేందర్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా వెంకటేశ్, ఓట్ కన్వీనర్‌గా వేణు, సంస్కృతిక కన్వీనర్‌గా సురేశ్, ఆడిట్ కమిటీ సభ్యులుగా సతీశ్‌కుమార్, సోషల్ మీడియా కన్వీనర్‌గా సాయికుమార్, కార్యదర్శులుగా బుద్ద దేవ్, సమత, యాదయ్య, శివరాములు, రాజ్‌కుమార్, అరుణ, శివలీల, నర్సింలు, అరుణజ్యోతి, మంజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, జిల్లా కార్యదర్శులు వెంకటయ్య, శివారెడ్డి, నర్సింలు, నాయకులు కృష్ణయ్య, నర్సింలు, ప్రేమ్‌సాగర్, రాములు, శేఖర్‌గౌడ్, రవికుమార్, కృష్ణయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పీసీసీ ఉపాధ్యక్షుడు, ప్రజాపాలన విజయోత్సవాల ఇన్‌చార్జి వినోద్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వినోద్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: ప్రజాసంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పీసీసీ ఉపాధ్యక్షుడు, ప్రజాపాలన విజయోత్సవాల చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి వినోద్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో ఏడాది ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా నియోజకవర్గ ముఖ్య నాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందనే విషయాలను ప్రజలకు తెలియజేస్తూ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరుగ్యారంటీల అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక ఒప్పందంతో ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నాయన్నారు. సమావేశంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యులు చింపుల సత్యనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

సమావేశానికి దూరంగా నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, ఆయన అనుచరులు..

పార్టీ ఏడాది పాలన విజయోత్సవాలు జరుపుకునే కార్యక్రమాలకు చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్‌కు సమాచారం లేదని ఆయన, మరికొంత మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి దూరంగా ఉన్నారు. బుధవారం చేవెళ్లలో విజయోత్సవాల కోసం ప్రత్యేకంగా నియోజకవర్గానికి పార్టీ ఇన్‌చార్జిని నియమించి ఆయనతో సమావేశం ఏర్పాటు చేసినా తమకు ఎలాంటి సమాచారం లేదని ఆయన వర్గీయులు అంటున్నారు. మండల కేంద్రంలో మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి ఆలూరు బాధితుల పరామర్శకు ఎమ్మెల్యే కాలె యాదయ్యతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ కూడా హాజరై పరామర్శించారు. మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డితో పాటు వచ్చిన భీంభరత్ తనకు ఎమ్మెల్యే నుంచి కానీ, నియోజకవర్గానికి నియమించిన విజయోత్సవాల ఇన్‌చార్జి నుంచి కూడా సమాచారం లేని కారణంగానే ఆయన ఈ సమావేశానికి దూరంగా ఉన్నట్లు సమాచారం. అధికారిక కార్యక్రమాలకు సమాచారం లేకపోయినా పార్టీ కార్యక్రమాలకైనా సమాచారం ఇవ్వరా అంటూ నిలదీస్తున్నారు. విజయోత్సవాలకు ప్రభుత్వం సిద్ధం అవుతుంటే నియోజకవర్గంలో వర్గపోరుతో దూరంగా ఉంటున్న నాయకులు, కార్యకర్తలను ఎవరు సమన్వయం చేస్తారోనని పలువురు చర్చించుకుంటున్నారు.

సమాజంలో అందరూ సమానమే

ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్‌రూరల్: ప్రపంచంలో ప్రజలందరూ సమానమేనని ఒకరు తక్కువ, ఒకరు ఎక్కువ లేదని, దైవమిచ్చిన సృష్టిలో అంగవైకల్యంతో దివ్యాంగులుగా ఏర్పడితే దానికి బాధపడాల్సిన అవసరం లేదని మండల అభివృద్ధి అధికారి సంధ్య, మండల విద్యాధికారి వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో గల దివ్యాంగుల పాఠశాలలో హిమాయత్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆంజనేయులు ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ, ఎంఈఓ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగవైకల్యం ఆటంకం కాదని సూచించారు. సమాజంలో ప్రజలందరూ సమానమేనని, దైవం ఇచ్చిన సృష్టిలో అందరూ కలిసిమెలసి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం సమాజంలో దివ్యాంగులు విజ్ఞానవంతులుగా ఎంతో ఎదుగుతున్నారని తెలిపారు. దివ్యాంగులుగా ఉన్న పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించినప్పుడే వారు ఉన్నతంగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆంజనేయులు, సుగుణ, కావేరి, కళావతి, రాములు, భాగ్యలక్ష్మి, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

జీవాలను రక్షించుకోవాలి

షాబాద్: వ్యాధుల నుంచి మూగ జీవాలను రక్షించుకోవాలని షాబాద్ పశువైద్యాధికారి స్రవంతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని లింగారెడ్డిగూడ, నరెడ్లగూడ గ్రామాల్లో గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీవాలకు ఎటువంటి రోగాలు ప్రబలిన వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో టీకాలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

బాధితులను ఆదుకుంటాం

మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి


బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే

చేవెళ్ల: బాధితులను ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తామని మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆలూరు, నాంచేరి గ్రామాల్లో ఆలూరు బస్‌స్టేజీ వద్ద జరిగిన లారీ ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డిలతో కలిసి పరామర్శించారు. అనంతరం తనవంతు సహాయంగా మృతి చెందిన కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాల పిల్లల చదువుకు తన సొంత ఖర్చులతో సహకారం అందిస్తానని తెలిపారు. ఏళ్లుగా ఈ రోడ్డు పనులు ప్రారంభం కాకపోవటం దురదృష్టకరమన్నారు. ఏడాదిలోపు ఈ రోడ్డు పనులు పూర్తవుతాయని చెప్పారు. ఆయన వెంట నాయకులు వసంతం, షాబాద్ దర్శన్, గౌరీ సతీశ్, వీరేందర్‌రెడ్డి, మానేయ్య, శ్రీనివాస్‌గౌడ్, రాములు, పెంటయ్యగౌడ్, జనార్ధన్, కృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పెంటారెడ్డి, సురేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నరేందర్, అనంతరాములు తదితరులు ఉన్నారు.